సాక్షి ఆదిలాబాద్

శనివారం । 20 । మే । 2023



ఉత్సాహంగా మ్యూజిక్ కన్సర్ట్

జిల్లా కేంద్రంలోని రిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో కాలేజ్ ఫెస్ట్ వేడుకలు కొనసాగుతున్నాయి. మూడో రోజు మ్యూజిక్ కన్సర్ట్ నిర్వహించారు. 8లో▸



బతుకమ్మ ఆడి నిరసన

కైలాస్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో వీవోఏలు చేపట్టిన సమ్మె 33వ రోజుకు చేరింది. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 43.0 /28.0

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోండి

కైలాస్‌నగర్: మున్సిపల్ చట్టం–2019లోని జీవో 147 ప్రకారం పట్టణంలోని వ్యాపారులు తమ ట్రేడ్ లైసెన్స్‌ను ఏటా మార్చి 31లోపు రెన్యువల్ చేసుకోవాలని కమిషనర్ శైలజ సూచించారు.మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జూన్ 1వ తేదీ వరకు 25 శాతం జరిమానాతో రెన్యూవల్ చేసుకునే అవకాశముందన్నారు. ఆ తరువాత రెన్యూవల్ చేసుకుంటే 50 శాతం జరిమానా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ట్రేడ్ లైసెన్స్ రుసుం ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని సూచించారు. ఈ విషయమై వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

22 నుంచి 'జిల్లా' పోటీలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈనెల 22 నుంచి 24 వరకు జిల్లా స్థాయి సీఎం కప్‌పోటీలు– 2023 నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు ప్రకటనలో తెలి పారు. ఈనెల 22న కబడ్డీ, వాలీబాల్, ఆర్చరీ, స్విమ్మింగ్ (పురుషులు, మహిళలు), బాక్సింగ్, ఫుట్‌బాల్ (పురుషులు), 23న ఖోఖో, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్ (పురుషులు, మహిళలు), రెజ్లింగ్ (పురుషులు), 24న హాకీ, వెయిట్ లిఫ్టింగ్, లాన్ టెన్నిస్ (పురుషులు), జిమ్నాస్టిక్స్, షూ టింగ్, టేబుల్ టెన్నిస్ (పురుషులు, మహిళలు) పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి 17 వరకు నిర్వహించిన మండలస్థాయి పోటీల్లో విజేతలు గా నిలిచిన క్రీడాకారులు, కోచ్ కమ్ మేనేజ ర్లు పోటీలు జరిగే రోజు ఉదయం 9గంటలలోగా స్టేడియంలో రిపోర్టు చేయాలని సూచించారు.

ప్రశాంతంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రాత పరీక్ష



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

కైలాస్‌నగర్: డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీ కోసం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పట్టణ శివారులోని నలంద డిగ్రీ కళాశాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతలుగా పరీక్ష నిర్వహించారు. మొత్తం 96 మంది అభ్యర్థులకు గాను 68మంది హాజరయ్యారు. పరీక్ష నిర్వహణను సెంటర్ ఇన్‌చార్జి పున్నారావు పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సెంటర్ వద్ద పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

వీఆర్‌ఏల సంబురాలు



సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తూ..

కైలాస్‌నగర్: గ్రామ రెవెన్యూ సహాయకులను (వీఆర్‌ఏ) క్రమబద్ధీకరిస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించడంపై వీఆర్‌ఏలు హర్షం వ్యక్తం చేశారు. మంత్రివర్గ నిర్ణయాన్ని స్వాగతిస్తూ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో శుక్రవారం సంబురాలు చేసుకున్నారు. సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకంతో పాటు టపాసులు కాల్చి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం నాయకులు ఇస్తారి, గంగన్న,లక్ష్మి,ఆశన్నతదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. రిమ్స్‌లోని బ్లడ్‌బ్యాంక్‌లో రక్త నిల్వలు తగ్గిన విషయం తెలుసుకున్న స్మైల్ సొసైటీ సభ్యులు శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న రోగులకు రక్తం అవసరం ఉంటుందని, సరైన సమయంలో బ్లడ్ బ్యాంక్‌లో రక్తం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు శ్రీకాంత్, సురేష్, రవికాంత్ యాదవ్, సాయి గౌడ్, రామకృష్ణ, విశాల్ పాల్గొన్నారు.

సీసీ పైనే సీసీ!



ఆర్‌ఎంసీ నుంచి తీసుకొచ్చిన మిశ్రమంతో రోడ్డు నిర్మాణ పనులు



↑ ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ విద్యుత్ కార్యాలయం వెనుక వైపు ఉన్న కాలనీలో సీసీ రోడ్డు కొత్తగా వేస్తున్నారు. ఇదివరకు నిర్మించిన సీసీ రోడ్డు బాగున్నప్పటికీ పైనుంచి మళ్లీ రోడ్డేస్తుండడంతో జనం విస్తుపోయే పరిస్థితి. టౌన్‌లోని అన్ని వార్డుల్లో ఇప్పుడు ఈ పనులే చేపడుతున్నారు. కొద్ది రోజుల క్రితం వీటిని ప్రారంభించారు. ప్రజలకు సౌకర్యం కల్పించే మాటేమో గానీ, నిధులు స్వాహా చేసేందుకే ఇలా చేస్తున్నారన్న విమర్శలు బాహాటంగా వ్యక్తమవుతున్నాయి.

- 'పట్టణ ప్రగతి' నిధుల స్వాహాపర్వం
- టౌన్‌లో ఇష్టారీతిన నిర్మాణ పనులు
- బాగున్న రహదారిపైనే మళ్లీ సీసీ
- నాణ్యతకు సైతం తిలోదకాలు
- అధికారుల తీరుపై అనుమానాలు

సాక్షి,ఆదిలాబాద్: పట్టణ ప్రగతి కింద జిల్లా కేంద్రంలోని 49 వార్డుల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించేందుకు నాలుగు నెలల క్రితం టెండర్లు నిర్వహించారు. రూ.8.91 కోట్లతో మొత్తం 31 వర్క్‌లను ఒకే ప్యాకేజీగా చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన ఎస్‌ఎస్‌వీ కన్‌స్ట్రక్షన్స్ వీటిని దక్కించుకుంది. కొద్ది రోజుల క్రితం సదరు కంపెనీ పనులను కూడా ప్రారంభించింది. అయితే బాగున్న రోడ్డుపై నుంచే మళ్లీ సీసీ వేస్తుండడంతో జనం ముక్కున వేలేసుకుంటున్నారు. ఓ వైపు పట్టణంలోని పలు కాలనీల్లో అసలే రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతుండగా.. మరోపక్కన ఇలా అవసరం లేకున్నా ఉన్న రోడ్డుపైనే మళ్లీ రోడ్డు వేస్తుండడం, మురుగు కాలువలు నిర్మిస్తుండడం గమనార్హం. మొత్తంగా పట్టణ ప్రగతిలో భాగంగా రూ.కోట్ల నిధులను కైంకర్యం చేసేందుకే ఇలా చేస్తున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

నాణ్యతా లోపం..

సీసీ రోడ్ల నిర్మాణం పూర్తిగా నాణ్యతా లోపంగా జరుగుతుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ పనుల్లో రెడిమిక్స్‌డ్ కాంక్రీట్ (ఆర్‌ఎంసీ) ప్లాంట్ మిశ్రమాన్ని వినియోగిస్తున్నారు. అయితే ప్లాంట్ల వద్ద నిబంధనల మేరకు కాంక్రీట్, సిమెంట్, ఇసుక మిశ్రమం జరగడం లేదన్న విమర్శలున్నాయి. సాధారణంగా ప్లాంట్‌లో మిశ్రమం జరిగే సమయంలో ఎవరైనా మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారి పర్యవేక్షణ ఉండాలి. అయితే ప్లాంట్ యాజమాన్యం మిశ్రమంలో వినియోగిస్తున్న వాటిని కేవలం ఒక పేపర్ ద్వారా అధికారులకు ఇస్తున్నారు. దాన్నే అధికారులు నమ్ముతుండడం అనుమానాలకు తావిస్తోంది.

ప్రతిపాదనలే అలా ఉన్నాయంటున్న అధికారులు..

బాగున్న రోడ్డుపైనే మళ్లీ రోడ్డు నిర్మిస్తున్న విషయంలో మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నిస్తే ఆ రోడ్ల నిర్మాణ ప్రతిపాదనల్లోనే అలాగున్నాయని చెబుతుండటం విస్తు కలిగిస్తుంది. దీనికి సంబంధించి తొలుత ప్రతిపాదనలు రూపొందించి కలెక్టర్‌కు పంపామని, కలెక్టర్ దాన్ని ఆమోదించారని, అక్కడి నుంచి మున్సిపల్ ఇంజినీరింగ్ చీఫ్‌కు పంపించగా, గ్రీన్‌సిగ్నల్ లభించిందని చెబుతున్నారు. దానికి అనుగుణంగానే ఈ పనులు చేపట్టామని పేర్కొంటున్నారు. అయితే పాత రోడ్డుపై కొత్త రోడ్డు వేసే పనుల్లో పరిమాణం ఒకవిధంగా, పూర్తిగా కొత్త రోడ్డు నిర్మించే దగ్గర పరిమాణం మరోవిధంగా ఉన్నాయని పేర్కొంటున్నారు.

కొత్త కాంట్రాక్ట్ సంస్థ..

ఆదిలాబాద్ మున్సిపాలిటీలో కొన్నేళ్లుగా రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి సంబంధించి కేవలం రెండు కాంట్రాక్ట్ సంస్థలు బాలాజీ, తిరుమల పేర్లే వినిపించేవి. అయితే ఇటీవల ఓ కాంట్రాక్ట్ సంస్థ మునపటి స్థాయిలో పనులు చేపట్టడం లేదన్న చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా రూ.కోట్ల విలువైన పట్టణ ప్రగతి పనులకు సంబంధించి హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్ట్ సంస్థకు అప్పగించారు. ఈ సంస్థ ఎవరిదనే చర్చ సాగుతోంది. నాణ్యతా లోపంతో పనులు సాగుతున్నాయని కాంట్రాక్టర్ అంజయ్యను ప్రశ్నిస్తే.. మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు సూచించిన విధంగానే చేస్తున్నామని చెప్పడం చోద్యంగా కనిపిస్తుంది. అధికారులు, కాంట్రాక్టర్, ఆర్‌ఎంసీ యాజమాన్యాలు ఒక్కటై నిధులు స్వాహా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మా దృష్టికి రాలేదు..

పట్టణంలో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, మురుగు కాలువల పనులు నాణ్యతా లోపంతో జరుగుతున్నట్లు మా దృష్టికి ఎవరూ తీసుకురాలేదు. ప్రతిపాదనల్లో ఉన్నమేరకు పనులు చేపడుతున్నాం. పాత రోడ్డుపై కొత్త రోడ్డు వేసేలా పైఅధికారుల అనుమతి తీసుకొనే చేపట్టాం. రెడిమిక్స్‌డ్ కాంక్రీట్‌కు సంబంధించి ప్లాంట్ నుంచి క్వాలిటీ షీట్‌ను తీసుకుంటున్నాం.

– తిరుపతి, ఇన్‌చార్జి ఎంఈ, ఆదిలాబాద్ మున్సిపాలిటీ

ఉపసంహరణ.. మంచిదే



- '2వేల' నోట్ల నిలిపివేతపై మెజార్టీ ప్రజాభిప్రాయం
- నల్లధనం బయటపడే అవకాశం
- సామాన్యులకు నో ఫికర్

కైలాస్‌నగర్: రూ.2వేల నోట్ల చలామణిని నిలిపివేస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిర్ణయించింది. వినియోగదారులకు ఈ నోట్లను ఇవ్వకూడదని శుక్రవారం అన్ని బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది. సంబంధిత నోట్లు కలిగిన వారు ఈ నెల 23 నుంచి సెప్టెంబర్ 30 వరకు బ్యాంకులు, ఆర్‌బీఐ కార్యాలయంలో మార్చుకోవచ్చని సూచించింది. రోజుకు రూ.20వేల నగదు మాత్రమే మార్చుకునేందుకు అవకాశం కల్పించింది. అయితే డిపాజిట్లపై మాత్రం ఎలాంటి పరిమితిని విధించలేదు. ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయంపై మెజార్టీ ప్రజలు మంచిదే అంటున్నారు. ఈ ప్రక్రియతో అక్రమార్కుల వద్ద దాచుకున్న నల్లధనం బయటపడే అవకాశముందని, అవినీతిని సైతం అరికట్టవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఉద్యోగులు, సామాన్యులకు వచ్చిన నష్టమేమి లేదని తెలుస్తోంది.

నల్లధనం బయటకు..



రూ.2వేల నోటు ప్రస్తుతం మార్కెట్లో ఎక్కువగా కనిపించ లేదు. రియల్ వ్యాపారులు, పొలిటీషియన్స్, అవినీతి అధికారుల వద్దనే పరిమితమైంది. ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయం ద్వారా నల్లధనం బయటపడే అవకాశం ఉంది. దేశ ఆర్థిక వ్యవస్థ మనుగడకు ఈ నిర్ణయం మంచిదే.

– బాలూరి గోవర్ధన్‌రెడ్డి, రైతు సంఘం నాయకుడు

చలామణిలో లేనేలేదు..



ఆర్‌బీఐ అధికారికంగా రూ.2వేల నోట్‌ను నిలిపివేస్తున్నట్లు ప్రస్తుతం ప్రకటించినా అనధికారికంగా ఆ నోటు ఏడాదిన్నరగా చలామణిలో లేదు. కార్పొరేట్ శక్తుల వద్ద ఉన్న నల్లధనాన్ని అధికారికంగా తెల్లధనంగా మార్చేందుకు చేసిన ఎత్తుగడే తప్పా దీని ద్వారా ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదు.

– ఎ.వెంకట్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

వ్యాపారులపై ప్రభావం



నల్లధనాన్ని అరికట్టాలనే ఉద్దేశంతో ఆర్‌బీఐ రూ.2వేల నోట్ల చలామణిని నిలిపివేస్తున్నట్లు ప్రకటించడం హర్షనీయమే. అయితే ప్రస్తుతం పెండ్లీల సీజన్ కావడంతో నగదు చలామణి నిలిపివేయడంతో వ్యాపారుల లావాదేవీలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

– జగదీష్ అగర్వాల్, చాంబర్ ఆఫ్ కామర్స్, మాజీ అధ్యక్షుడు

హర్షనీయమే



రూ.2వేల నోట్ల చలామణిని నిలిపివేస్తూ ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ఇది బ్లాక్ మనీ కలిగిన రాజకీయ నాయకులకు మాత్రమే ఇబ్బందికరం. సామాన్యులు, ఉద్యోగులకు వచ్చిన ఇబ్బంది ఏమీ ఉండదు.

– మహ్మద్ ముజాయిద్, రియల్ వ్యాపారి

నల్లధనం కలిగిన వారికి ఇబ్బంది



రూ.2వేల నోట్ల ఉపసంహరణతో నల్లధనం దాచుకున్న వారికి తప్ప.. సామాన్యులు, ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. కోట్లల్లో అక్రమ సంపాదన కలిగిన వారు నోట్లను మార్చుకోవాలంటే లెక్కలు చెప్పాల్సి ఉంటుంది. ఈ నిర్ణయంతో నల్లధనం బయటపడే అవకాశం ఉంది.

– మనీష్ అగర్వాల్, చార్టెడ్ అకౌంటెడ్

ఒడిసిపట్టి.. అవార్డు గెలిచి

- జల సంరక్షణలో జిల్లాకు ప్రత్యేక గుర్తింపు
- జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు
- కేంద్ర జలశక్తి అభియాన్ మంత్రిత్వశాఖ వెల్లడి

జల సంరక్షణకు జిల్లాలో దోహదపడిన అంశాలు..

హరితహారం కింద నాటిన మొక్కలు : 59లక్షలు

మృత్తిక సంరక్షణ నిర్మాణాలు: 1076	నీటి కుంటల నిర్మాణాలు: 336

నీటి కుంటల మరమ్మతులు : 26

మిషన్ కాకతీయలో పునరుద్ధరించిన చెరువులు : 349

చెక్ డ్యాంల నిర్మాణాలు : 210	రూఫ్ టాప్ హార్వెస్టింగ్ నిర్మాణాలు: 63
పాం ఫాండ్స్: 150	



తాంసి మండలం హస్నాపూర్‌లో నిర్మించిన చెక్‌డ్యాం

కైలాస్‌నగర్: అడవుల జిల్లాగా పేరొందిన ఆదిలాబాద్‌కు జాతీయస్థాయిలో మరో గుర్తింపు దక్కింది. నీటి వనరుల సంరక్షణ, నిర్వహణకు జిల్లాలో చేపట్టిన చర్యలకు గాను ఈ పురస్కారం వరించింది. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ– 2022 సంవత్సరానికి గాను జాతీయ నీటి అవార్డులను గురువారం ప్రకటించింది. ఇందులో ఆదిలాబాద్ జిల్లా దేశంలోనే మూడో స్థానంలో నిలువడం ప్రాధాన్యత సంతరించుకుంది. త్వరలో నిర్వహించనున్న అవార్డుల ప్రదానోత్సవానికి ఆహ్వానిస్తూ కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ కార్యదర్శి నుంచి జిల్లా కలెక్టర్‌కు లేఖ అందింది. నీటి సంరక్షణకు గాను జిల్లా యంత్రాంగం చేపట్టిన కృషికి తగిన ఫలితం దక్కినట్లైంది.

నీటి సంరక్షణ చేశారిలా....

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన హరితహారం, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలు జల వనరుల పునరుద్ధరణకు ఎంతగానో దోహదపడ్డాయి. సాగునీటి పారుదలశాఖ ద్వారా మిషన్ కాకతీయ కింద చెరువుల పునరుద్ధరణతో పాటు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పెద్ద ఎత్తున ఇంకుడు గుంతలను నిర్మించారు. గ్రామీణ ప్రాంతాల్లో అటవీశాఖ, డీఆర్డీఏ ద్వారా చెక్ డ్యాంలు, నీటి కుంటలు, వాటర్ షెడ్‌ల ఏర్పాటుతో పాటు మృత్తిక సంరక్షణ చర్యలు, వర్షపు నీటిని సంరక్షించేలా ఇంటి మేడలపైన చేపట్టిన నిర్మాణాలు భూగర్భజలాల పెంపునకు దోహదపడ్డాయి. ఉపాధి హామీ ద్వారా నీటి సంరక్షణ కాలువలను నిర్మించారు. తద్వారా భూ గర్భజలాలు గణనీయంగా వృద్ధి చెందాయి. దీనికి తోడు హరిత హారం కింద ఆయా ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. పల్లె ప్రకృతి వనాల్లోనూ లక్షలాదిగా మొక్కలు నాటడంతో అవి పెరిగి వర్షాలు సమృద్ధిగా కురిసేందుకు దోహదపడ్డాయి. ఇలా ఆయా శాఖలు సమన్వయంతో చేపట్టిన చర్యలతో నీటి సంరక్షణ జరిగి జాతీయ స్థాయిలో అవార్డు వచ్చేందుకు ఉపకరించింది.

సంవత్సరం	సాధారణ వర్షపాతం(మి.మీ)	కురిసిన వర్షపాతం(మి.మీ)	వ్యత్యాసం (శాతం)
2018–19	1199	1303	9
2019–20	1199	1122	–6
2020–21	1199	1029	–14
2021–22	1199	1559	30

క్షేత్రస్థాయిలో నిశిత పరిశీలన

యంత్రాంగం నీటి సంరక్షణకు చేపట్టిన చర్యలపై కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖకు చెందిన ముగ్గురు అధికారులతో కూడిన బృందం జిల్లాలో నిశిత పరిశీలన చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇద్దరు అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించగా ఒక అధికారి ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో నీటి సంరక్షణ చర్యలను పరిశీలించారు.

- అంకోలి, ముఖరా(కే) గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాలు, మిషన్ కాకతీయ చెరువులతో పాటు జైనథ్ మండలంలోని కోర్టా–చనాఖా బ్యారేజీ నిర్మాణం, అందులో నీటి నిల్వ సామర్థ్యంతో పాటు దాని చుట్టూరా పంట చేలు, గ్రామాల్లో పెరిగిన భూగర్భ జలాలను పరిశీలించారు.
- బంగారుగూడలో మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మురుగునీటి శుద్ధి వనరుల కేంద్రం, మియవాకి పద్ధతిలో పెంపొందించిన దుర్గానగర్ నర్సరీని పరిశీలించారు.
- మిషన్ భగీరథ ద్వారా జిల్లాలో ఎన్ని గ్రామాలకు స్వచ్ఛమైన శుద్ధజలం అందుతుంది.. ఆ నీటిలోని నాణ్యతను పరిశీలించారు. 2015లో జిల్లాలో భూగర్భజలాల పరిస్థితి ఏంటి.. ప్రస్తుతం ఏ మేరకు వృద్ధి చెందాయనే దానిపై ఆరా తీశారు.
- అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయా శాఖలతో సమావేశం నిర్వహించారు. నీటి వనరుల సంరక్షణ, నిర్వహణపై అదనపు కలెక్టర్ రిజ్వాన్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లాలో చేపట్టిన చర్యలను వివరించారు. ఈ వివరాల నమోదుతో పాటు పునఃపరిశీలన జరిపిన బృందం సభ్యులు సంబంధిత మంత్రిత్వశాఖకు నివేదక అందజేశారు. వాటి ఆధారంగా మార్కులు కేటాయించారు. మొత్తం 16అంశాలతో కూడిన వచ్చిన మార్కుల ఆధారంగా జాతీయస్థాయిలో జిల్లాకు మూడో స్థానం దక్కింది.



Regards

Yours sincerely,

(Pankaj Kumar)

అవార్డుకు ఎంపికైనట్లు కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నుంచి కలెక్టర్‌కు అందిన లేఖ

అవార్డు రావడం సంతోషకరం

నీటి వనరుల సంరక్షణ, ని ర్వహణ విభాగంలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ప్రకటించిన జాతీయ స్థాయి అ వార్డుల్లో జిల్లాకు మూడో స్థా నం దక్కడం సంతోషకరం. ఇందు కోసం అహర్నిశలు కృషి చేసిన అదనపు కలెక్టర్ రిజ్వాన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, ఇతర అన్ని శాఖల అధికారులు, సిబ్బంది కృషి అభినందనీయం. ఇదే స్ఫూర్తితో అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ, ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, మీడియా మిత్రుల సహకారంతో జిల్లాను అన్ని రంగాల్లో మరింత అగ్రస్థానంలో నిలిపేలా ముందుకు సాగుతాం.

– రాహుల్‌రాజ్, కలెక్టర్

రిమ్స్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

- రోగులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశం



రిమ్స్‌లో తాగు నీటి వసతిపై ఆరా తీస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

సాక్షి ఎఫెక్ట్

ఆదిలాబాద్‌టౌన్: 'దాహం తీరేదెలా..?' శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ రాహుల్ రాజ్ స్పందించారు. రిమ్స్ ఆస్పత్రిని శుక్రవారం తనిఖీ చేశారు. రోగులకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను ఆదేశించా రు. మొదటి, రెండు, మూడు అంతస్తుల్లో ఏర్పాటు చేసిన తాగునీటి వసతిని పరిశీలించారు. ఆవరణలో స్వచ్ఛంద సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన కుళాయిలను పరిశీలించి అపరిశుభ్రత లేకుండా చూడాలన్నారు. మురుగు కాలువల్లో ఉన్న పూడికను తొలగించి రెండు రోజుల్లో శుభ్రం చేయాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా ఉదయం రిమ్స్ డైరెక్టర్ మొదటి అంతస్తులో ఆర్వో ప్లాంట్, రెండు, మూడు అంతస్తుల్లో మిషన్ భగీరథ ద్వారా నీటిని ఫ్రిజ్‌లో ఏర్పాటు చేసి రోగులకు అందుబాటులో ఉంచారు.



'సాక్షి'లో ప్రచురితమైన కథనం

క్లుప్తంగా

ఐటీఐలో అడ్మిషన్లకు దరఖాస్తులు

ఉట్నూర్‌రూరల్: 2023–24 విద్యా సంవత్సరానికి మండల కేంద్రంలో ఐటీఐ కళాశాలలో మొదటి దఫా అడ్మిషన్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు తెలిపారు. ఈ నెల 17 నుంచి జూన్ 10లోగా iti,telangana.gov.in వెబ్ సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేటప్పుడు పేరు, తండ్రి పేరు, తల్లి పేరు, పుట్టిన తేదీ ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేయాలని, ఇతర వివరాలకు 9490202037 సంప్రదించాలని కోరారు.

రైతులను పట్టించుకోని ప్రభుత్వం

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు


ధాన్యం కుప్ప వద్ద రైతులతో మాట్లాడుతున్న బొజ్జు

కడెం: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. కేంద్రాల్లో అదనంగా తూకం వేయడంతో పాటుగా మిల్లులో ధాన్యం కోత విధిస్తూ రైతులను నిండా ముంచుతున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ స్పందించి కొనుగోలు కేంద్రాల్లో దోపిడీని అరికట్టాలని కోరారు. అనంతరం మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుర్గ భవానీ, మండల నాయకులు తుమ్మల మల్లేష్, వాజీద్ ఖాన్, సలీం, బబ్లూ, భూషణం ఉన్నారు.

ఘనంగా భావేయిపేన్


రోకలికి కట్టిన కప్పకు నీళ్లుపోస్తున్న ఆదివాసీలు

బోథ్: మండలంలోని పార్డి (కె) గ్రామంలో భావేయిపేన్ పూజలను ఆదివాసీలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆదివాసీల సంప్రదాయం ప్రకారం రోకలికి కప్పను కట్టి నీళ్లు పోస్తూ ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు కాళ్లకు, నడుముకు గజ్జెలు కట్టుకుని ఊరంతా తిరిగారు. అనంతరం కప్పను వాగులో వదిలారు. కప్ప ఏ దిశలో వెళ్తుందో ఆ దిశ నుంచి వర్షాలు కురుస్తాయని వారు పేర్కొన్నారు. ఈ సంప్రదాయాన్ని ప్రతియేటా మే చివరి వారంలో నిర్వహిస్తామని స్థానికులు పేర్కొన్నారు.

అస్వస్థతతో యువకుడి మృతి


సిద్గర్ సాయినాథ్ (ఫైల్)

నర్సాపూర్(జి): మండలంలోని తురాటి గ్రామానికి చెందిన సిద్గర్ సాయినాథ్(38) డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన భార్య వనిత స్థానికుల సాయంతో ఆటోలో భైంసా ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి గోదావరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఏఎస్సై మాన్‌సింగ్ పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

స్థాయీ సంఘాలేవి..?


బోథ్ గ్రామ పంచాయతీలోని సమావేశంలో పాల్గొన్న పాలకవర్గం(ఫైల్)

- పంచాయతీల్లో సలహాలు, సూచనలకు నియామకం
- సంఘాలను విస్మరిస్తున్న పాలకవర్గాలు
- సమావేశాలకు సభ్యులను ఆహ్వానించని వైనం

బోథ్: గ్రామస్థాయిలో లోపాలను ఎప్పటికప్పుడు ఎత్తి చూపినప్పుడే పంచాయతీల పాలన మెరుగవుతోంది. అన్నీ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నెలనెలా పల్లెప్రగతి ద్వారా నిధులు విడుదల చేస్తోంది. అభివృద్ధి పనులు ప్రాధాన్యతా క్రమంలో చేపట్టడంతో పాలకవర్గాలు స్థానిక కమిటీల సూచనలు, సలహాలను పక్కన పెడుతున్న పరిస్థితి గ్రామాల్లో నెలకొంది. 2014 నుంచి స్థానిక స్థాయీ సంఘాల ఎంపిక తెరపైకి వచ్చింది. ప్రతీ పంచాయతీలో నాలుగు సంఘాలు పాలకవర్గాలకు అనుసంధానంగా ఎంపిక చేశారు. ఏ పంచాయతీలోనూ స్థానిక స్థాయీ సంఘాలకు ప్రభుత్వ కార్యక్రమాల్లో, పాలకవర్గ సమావేశాల్లోనూ ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో కొన్ని పంచాయతీల్లో సభ్యులు సమావేశాల దరిదాపుల్లోకి కూడా రావడం లేదు. చాలా గ్రామాల్లో అసలు స్థాయీ సంఘాలు ఉన్నాయనే విషయం ప్రజలకు తెలియని పరిస్థితి నెలకొంది.

ప్రతీ కమిటీలో 15 నుంచి 30 మంది..

జిల్లాలో 468 పంచాయతీలు ఉండగా.. ఒక్కొక్క పంచాయతీలో నాలుగు స్థాయీ సంఘాలను ఎంపిక చేశారు. ప్రతీ కమిటీలో సర్పంచి, కార్యదర్శితో పాటు 15–30 మందితో సభ్యులు ఉంటారు. ఇందులో 50శాతం మంది మహిళలు ఉంటారు. మొత్తం 468 పంచాయతీలకు 1872 స్థాయీ సంఘాలు ఉన్నాయి. ఇందులో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు మినహా 14వేల మంది సభ్యులుగా ఉన్నారు. ప్రభుత్వపరంగా గౌరవ వేతనం ఉండదు. గ్రామాభివృద్ధికి వీరి సలహాలు, సూచనలే కీలకం. కనీసం వారిని పాలకవర్గాలు గ్రామ సభలకు కూడా ఆహ్వానించడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

సంఘాలు ఎందుకంటే..

- పారిశుధ్యం, డంపింగ్ యార్డు, శ్మశాన వాటికల నిర్వహణకు సలహాలు ఇవ్వడం.
- వీధిదీపాలను పరిశీలిస్తూ విద్యుత్తు పొదుపునకు సహకరించడం.
- నర్సరీల నిర్వహణకు సూచనలు, మొక్కలు నాటడం, పచ్చదనం పెంపొందించడం.
- ప్రజా పనులు, సంతలకు సంబంధించి పర్యవేక్షణ, సూచనలు చేయడం

సలహాలు స్వీకరిస్తూ అభివృద్ధికి దోహదం

గ్రామ పంచాయతీలు పాలకవర్గాలు స్థాయీ సంఘాల సలహాలు, సూచనలను స్వీకరిస్తే గ్రామాభివృద్ధికి మరింతగా దోహద పడనుంది. స్థాయీ సంఘాలలో అన్ని వర్గాల వారికి ప్రధానంగా మహిళలకు ప్రాతినిధ్యం ఎక్కువగా ఉంటుంది. గ్రామంలోని ఏ మూలన ఏ సమస్య ఉందనే విషయం స్థాయీ సంఘాల సభ్యుల ద్వారా ఇట్టే తెలిసిపోతుంది. తదనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటూ సమస్యలను పరిష్కరించుకునే ఆస్కారం ఉంది.

– ధర్మారాజి, డీఎల్పీవో

నా కొడుకును కాపాడండి..

- రోడ్డు ప్రమాదంలో గాయాలు
- నరాల వ్యవస్థ దెబ్బతిని మంచానికే పరిమితం..
- భర్త, రెండేళ్ల కొడుకును వదిలి వెళ్లిన భార్య
- కొడుకు, మనువడిని చూసుకుంటున్న తల్లి
- వైద్యానికి రూ.5లక్షలు కావాలన్న వైద్యులు
- సాయం చేయాలని వేడుకుంటున్న తల్లి


కొడుకుతో మంచంపై మల్లేశ్


అన్నం తినిపిస్తున్న తల్లి రాజవ్వ

కడెం: రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబం వారిది. ఓ రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. కట్టుకున్న వాడితో కడదాక తోడుండాల్సిన భార్య.. భర్తను, కన్న కొడుకును పట్టించుకోకుండా వదిలివెళ్లింది. దిక్కుతోచనిస్థితిలో మంచం పట్టిన కొడుకు, రెండేళ్ల మనువడి ఆలనాపాలన చూస్తూ దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది ఓ తల్లి. ఇది కడెం మండలంలోని కొత్తమద్దిపడగ గ్రామానికి చెందిన ఓ అభాగ్యుడి దీనగాథ...

సాయం కోసం ఎదురుచూపు...

కడెం మండలంలోని కొత్త మద్దిపడగా గ్రామానికి చెందిన నాంపెల్లి రామవ్వ–లక్ష్మణ్ దంపతులకు ముగ్గురు కుమారులు. చిన్న కొడుకు నాంపల్లి మల్లేశ్‌కు లక్ష్మీసాగర్ గ్రామానికి చెందిన ఓ యువతితో వివాహమైంది. వీరికి రెండేళ్ల కుమారుడు. కుటుంబ పోషణకు మల్లేశ్ బ్యాండ్ కొడుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. 2021 డిసెంబర్‌లో ధర్మాజీపేట్ గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పి కింద పడడంతో మల్లేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి ఉస్మానియా, గాంధీ, రిమ్స్ ఆస్పత్రులకు తరలించారు. రూ.లక్ష వరకు ఖర్చు చేసినా నయం కాలేదు. వెన్నుభాగం, నరాల వ్యవస్థ దెబ్బతినడంతో ఆపరేషన్‌కు రూ.4 నుంచి 5లక్షల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపారు.

17 నెలలుగా మంచానికే.. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న సమయంలో భార్య వేరే వ్యక్తితో వెళ్లిపోయింది. దీంతో కొడుకు, మనువడికి అన్నీతానై వారిని చూసుకుంటోంది తల్లి రామవ్వ. నరాల వ్యవస్థ దెబ్బతినడంతో 17 నెలలుగా మల్లేశ్ మంచానికి పరిమితమయ్యాడు. అచేతన స్థితిలోని మల్లేశ్‌కు తల్లి రామవ్వ సపర్యాలు చేస్తోంది. చేతిలో చిల్లిగవ్వ లేని మల్లేశ్ తనకు చికిత్స కోసం సాయం అందించి ఆదుకోవాలని వేడుకుంటుంది.

– నాంపెల్లి మల్లేశ్

– ఫోన్ పే నంబర్: 9885424339

పొట్ట కోసి.. జుట్టు తీసి

- రిమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స
- బాలిక కడుపులో కిలోన్నర వెంట్రుకలు


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్


ఆపరేషన్ ద్వారా బాలిక కడుపులో నుంచి బయటకు తీసిన వెంట్రుకలతో కూడిన కణతి

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణానికి చెందిన 16 ఏళ్ల బాలిక ఐదేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతోంది. జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చూపించినా తగ్గలేదు. నాలుగైదు రోజులుగా నొప్పి తీవ్రమైంది. దీంతో బాలిక అన్నం తినడం మానేసింది. నీళ్లు మాత్రమే తాగుతోంది. గురువారం కుటుంబీకులు ఆమెను రిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు సీటీస్కాన్ చేశారు. కడుపులో వెంట్రుకలతో కూడిన కణతి ఉన్నట్లు గుర్తించారు. శుక్రవారం వైద్యులు శిరీశ్, గణేశ్, నరేశ్ రాథోడ్‌లు అరుదైన ఆపరేషన్ చేసి కిలోన్నర వెంట్రుకలను బయటకు తీశారు. అనంతరం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ విలేకరులతో మాట్లాడారు. కొద్ది రోజులుగా బాలిక వెంట్రుకలు తింటున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో అవి జీర్ణం కాకుండా జీర్ణాశయంలో ఆగిపోయి గడ్డలుగా మారినట్లు తెలిపారు. ఇలా తినడాన్ని వైద్య భాషలో 'ట్రైకోబజోఆర్' అని పిలుస్తారని పేర్కొన్నారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆపరేషన్ విజయవంతం కావడంపై వైద్యులను అభినందించారు. పేదలు రిమ్స్ ఆస్పత్రిలో అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో వైద్యులు కపిల్, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వృద్ధుడి ఆత్మహత్య


బాల్‌రాజ్ (ఫైల్)

లక్ష్మణచాంద: మద్యానికి బానిసై వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... పీచర గ్రామానికి చెందిన నైనం బాల్‌రాజ్ (60) ఇటీవల కంటి ఆపరేషన్ చేయించుకున్నాడు. అప్పటి నుంచి ఆరోగ్యం బాగలేకపోవడంతో మద్యానికి బానిసై మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వ్యవసాయ చేనులోకి వెళ్లి కేబుల్ వైర్‌తో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాల్‌రాజ్ ఇంటికి రాకపోవడంతో గాలించగా ఉరేసుకుని కనిపించాడు. సంఘటన స్థలానికి ఎస్సై రాహుల్ గైక్వాడ్ చేరుకుని వివరాలు సేకరించారు. భార్య మల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. బాల్‌రాజ్‌కు భార్య మల్లవ్వ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

దాడిచేసిన ముగ్గురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని నీలానగర్‌కు చెందిన షేక్ దావుద్‌పై దాడిచేసిన ముగ్గురిపై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు వివరాల ప్రకారం.. పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన షేక్ సల్మాన్, జమీర్, అజర్‌లు ఈ నెల 16న రాత్రి 9గంటలకు దావుద్ ఇంటికెళ్తున్న సమయంలో డీటీసీ వద్ద ఆపి దుర్భాషలాడారు. పాత కక్షలతో రాడ్‌తో దాడి చేశారు. ఆయన చికిత్స అనంతరం శుక్రవారం ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణు ప్రకాష్ తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో వివాహిత మృతి

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ షాక్‌తో చెందిన వివాహిత మృతిచెందింది. ఆమె తండ్రి గంగన్న వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని కొక్‌మండి గ్రామానికి చెందిన పడకంటి రేణుక (33) శుక్రవారం ఉదయం కుళాయికి మోటార్ బిగించి నీళ్లు పడుతుండగా విద్యుత్‌షాక్‌కు గురైంది. ఆమెను రిమ్స్‌కు తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న గణేశ్ రాథోడ్

ఉట్నూర్‌రూరల్: మండలంలోని పెర్కగూడ జేసీఎస్ గార్డెన్‌లో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ (టీటీఎఫ్‌టీఎస్) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు రామారావు నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేశ్ రాథోడ్ పాల్గొని మాట్లాడారు. జీవో 3కు చట్టబద్ధత కల్పించాలని, ఉపాధ్యాయుల బదిలీలు ఏజెన్సీ నుంచి ఏజెన్సీ ప్రాంతానికి, మైదాన ప్రాంతం వారికి మైదాన ప్రాంతానికి నిర్వహించాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో జిల్లా పరిషత్‌లో వెంటనే బదిలీలు నిర్వహించాలని తెలిపారు. పెండింగ్‌లోని బిల్లులు వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీ కమిటీ వేసి ఐఆర్‌ను ప్రకటించాలని, సీఆర్టీలను రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పీఈటీ, భాష పండితులను క్రమబద్ధీకరణ చేయాలన్నారు. వీటీతో పాటు 9 సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో టీటీఎఫ్ జిల్లా నాయకులు దినేశ్, మంగులాల్, సురేశ్, రమేశ్, రామారావు, విశ్వనాథ్, సంతోశ్, ధన్‌రాజ్, జేఏసీ నాయకులు శేషరావు, అడ్వకేట్ జగన్, నాయకులు రాజేశ్, సుమిత్ పాల్గొన్నారు.

కుటుంబ పోషణ భారమై మహిళ ఆత్మహత్య


వందన మృతదేహం

దిలావర్‌పూర్: మండలంలోని కాల్వతాండ గ్రామానికి చెందిన జాదవ్ వందన (37) శుక్రవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై వివరాల ప్రకారం... వందన భర్త రాజు గతంలోనే మృతిచెందాడు. అప్పటి నుండి ఇద్దరు కుమారులు, కూతురును పోషించుకుంటోంది. ఇటీవల రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టింది. అందుకోసం రూ.1,50,000 అప్పు తీసుకుంది. వాటిని తీర్చలేక, కుటుంబ పోషణ భారమై శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు.

మహిళల కోసం పొదుపు పథకం


మాట్లాడుతున్న పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సుశ్మిత బెనర్జీ

భైంసా: పోస్టల్ శాఖ మహిళల కోసం ప్రత్యేకంగా చిన్నమొత్తాల పొదుపు పథకం ప్రవేశపెట్టిందని భైంసా పోస్టల్ శాఖ ఇన్‌స్పెక్టర్ సుశ్మిత బెనర్జీ అన్నారు. భైంసాలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. 2023లో భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మాల్ సేవింగ్స్ స్కీమ్ సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ ప్రత్యేకంగా మహిళల కోసం రూపొందించిందన్నారు. ఈ పథకంలో డిపాజిట్లపై ఏడాదికి 7.5 శాతం వడ్డీ లభిస్తుందని, త్రైమాసికానికి కలిపి ఖాతాలో వడ్డీ జమవుతుందని తెలిపారు. భైంసా డివిజన్‌లోని అన్ని పోస్ట్ ఆఫీస్‌లలో ఈ ఖాతాలు తెరుచుకోవచ్చని పేర్కొన్నారు. గ్రామాల్లో సిబ్బంది మహిళలకు అవగాహన కల్పించి ఎక్కువ మొత్తంలో డిపాజిట్లు అయ్యేలా చూడాలని కోరారు. ఈ పథకంలో అందిస్తున్న వడ్డీ పథకంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. పూర్తి సమాచారం కోసం పోస్టల్ సిబ్బంది, పోస్టల్ కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు.

ఉత్సాహంగా మ్యూజిక్ కన్సర్ట్


గీతాలు ఆలపిస్తున్న సింగర్స్


కార్యక్రమాన్ని కెమెరాలో బంధిస్తున్న విద్యార్థులు


ఉత్సాహంగా స్టెప్పులు వేస్తున్న వైద్య విద్యార్థులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో కాలేజ్ ఫెస్ట్ వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో భాగంగా 2019 బ్యాచ్ ఫైనల్ ఇయర్ ఎంబీబీఎస్ విద్యార్థులు శుక్రవారం మ్యూజిక్ కన్సర్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి వచ్చిన మ్యూజిక్ బ్యాండ్ బృందం ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. వారి గీతాలకు విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. శనివారం కల్చరల్ ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

పురుగుల మందుతాగి యువకుడి ఆత్మహత్య


సిడాం చంద్రకాంత్(ఫైల్)

బజార్‌హత్నూర్: మండలంలోని చింతలసాంగ్వీ గ్రామానికి చెందిన సిడాం చంద్రకాంత్(22) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... చంద్రకాంత్ శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరులేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు చంద్రకాంత్‌ను 108లో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రాత్రి మృతిచెందాడు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో బాల కేంద్రం చిన్నారులు



నృత్య ప్రదర్శన ఇస్తున్న బాల కేంద్రం చిన్నారులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని బాల కేంద్రం చిన్నారులు గురువారం రాత్రి నిర్వహించిన ఆన్‌లైన్ రాష్ట్రస్థాయి కూచిపూడి నృత్య పోటీల్లో పాల్గొన్నారు. అఖిల నటరాజన్ అంతర్ సాంస్కృతిక సంఘం నాగపూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వరల్డ్ ఒలంపియాడ్ సీజన్- 5 పోటీల్లో పాల్గొని తమ నృత్యాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా బాలకేంద్రం పర్యవేక్షకులు మిట్టు రవి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి కూచిపూడి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు డిసెంబర్ నెలలో జరిగే జాతీయ స్థాయి నృత్య పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బాల కేంద్రం తల్లిదండ్రుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రవీందర్ రెడ్డి, సృజన, శ్రావణ్, అనూష, రుచిత, లక్ష్మణ్, చంద్రకళ దేవి, సునీల్, ఈశ్వర్ పాల్గొన్నారు.

